సాక్షి
బాపట్ల
మంగళవారం ၊ 10 ၊ సెప్టెంబర్ ၊ 2024



మళ్లీ పెరిగిన పులిచింతల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,10,854 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. నాలుగు గేట్లు ఎత్తి 1,10,854 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



వరద తగ్గుముఖం

కొల్లూరు:వరద తగ్గుముఖం పట్టడంతో కృష్ణా పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఆదివారం భారీగా వరదలొచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



రేషన్ బియ్యం వరదపాలు

కొల్లూరు: వరద ప్రభావిత లంక గ్రామాలలో వరదల్లో రేషన్ బియ్యం తడిచిపోయి బూజు పట్టి భరించలేని దుర్గంధం వెదజల్లుతూ పాడయ్యాయి. వేమూరు గోడౌన్‌కు తరలించారు.

న్యూస్‌రీల్

కూలిన పూరిళ్లు



భట్టిప్రోలు: వరదల ప్రభావానికి లంక గ్రామాలు కకావికలమయ్యాయి. దీంతో పూరిళ్లల్లో ఉండే వారు బతుకుజీవుడా అంటూ పలువురి ఇళ్లల్లో తలదాచుకుని తమ స్వగృహాలకు వస్తుండగా కొందరి పూరిళ్లు నేలకొరగడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. పెదలంక మధ్యగూడెంకు చెందిన కారుమూరి నరేష్ వరద వచ్చినప్పుడు సమీపంలోని నన్నెపాముల మనోజ్ ఇంట్లో భార్య, ముగ్గురు చిన్నారులతో తల దాచుకున్నారు. తీరా వరద తగ్గాక వచ్చి చూస్తే పూరిల్లు నేలకొరిగింది. దీంతో తన తండ్రి కుటుంబరావు ఇంట్లో సర్దుకుని తలదాచుకుంటున్నాడు. ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: పవిత్ర అరుణాచల గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో– 2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న బస్సు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, ఆ రోజు రాత్రి అక్కడే ఉండి, 18న గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి గుంటూరుకు బయలుదేరి 19న ఉదయానికి చేరుకుంటుందని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకుని అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో టికెట్ ధర రూ 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7382894613కు సంప్రదించాలని సూచించారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో పాస్టర్‌కు 20 ఏళ్లు జైలుశిక్ష

నగరంపాలెం: మైనర్‌పై అత్యాచారానికి ఒడిగట్టి గర్భవతి చేసిన పాస్టర్‌కు ఇరవై ఏళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు, ఐదో అదనపు జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే..గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన ఎన్.కోటేశ్వరరావు (55)చర్చి నిర్వహించేవారు. గ్రామాల్లోనూ ఆయిల్స్ వ్యాపారం చేసేవాడు. చర్చికి పరిసర ప్రాంతాల వారు వచ్చేవారు. సాయంత్రం చర్చిలో ప్రార్థనలు ముగిశాక మైకులు, పరదాలను కొందరు బాలికలు సర్దేవారు. 2018లో 15 ఏళ్ల బాలికతో కోటేశ్వరరావు అసభ్యంగా ప్రవర్తించి, బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో బాలిక భయపడి, చర్చికి వెళ్లడం లేదు. అయితే, పాస్టర్ ఏం తెలియనట్టుగా బాలిక తండ్రితో మాట్లాడేవాడు. కుమార్తె చర్చికి రావడంలేదని, భయం ఉండటం లేదని తండ్రితో చెప్పేవాడు. తర్వాత బాలికకు నెలసరి సక్రమంగా రాకపోవడంతో తల్లిదండ్రులు విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి నాలుగో నెల గర్భవతిగా నిర్ధారించారు. దీంతో కుమార్తెను ఏం జరిగిందని తల్లిదండ్రులు ఆరా తీయగా, అసలు విషయం బయటకొచ్చింది. ఈ మేరకు తల్లిదండ్రులు పాస్టర్‌పై తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ సిహెచ్.రవిబాబు కేసు దర్యాప్తు చేపట్టి, కోటేశ్వరరావును అరెస్ట్ చేశారు. దీనిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి నేరం రుజువుకావడంతో సోమవారం కోటేశ్వరరావుకు 20 ఏళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయాలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు, ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ తీర్పు వెలువరించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

దుగ్గిరాలలో అత్యధికంగా 16.4 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 16.4 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా పెదకాకాని మండలంలో 3.2 మి.మీ. వర్షం పడింది. సగటున 8.4 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ఫిరంగిపురం మండలంలో 12.4 మి.మీ., వట్టిచెరుకూరు 10, మేడికొండూరు 9.8, కొల్లిపర 9.2, పొన్నూరు 9, చేబ్రోలు 8.8, తుళ్లూరు 8.8, గుంటూరు పశ్చిమ 8.8, కాకుమాను 8.6, తాడేపల్లి 7.8, గుంటూరు తూర్పు 7.8, మంగళగిరి 7.4, తాడికొండ 7.2, ప్రత్తిపాడు 6.6, పెదనందిపాడు 5.2, తెనాలి మండలంలో 4.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

ఉద్యానం.. అధ్వానం

జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో ఉద్యాన పంటల సాగు అధికం. ముఖ్యంగా సారవంతమైన లంక గ్రామాల భూములు ఈ పంటలకు అనుకూలం. దీంతో ఈ ప్రాంత రైతులు ఉద్యాన పంటల సాగుకే మొగ్గుచూపుతారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వందల ఎకరాల్లో పంటలు సాగుచేసిన రైతులను ఇటీవల వచ్చిన వరదలు కోలుకోలేని దెబ్బ తీశాయి. వేసిన ప్రతి తోటా దాదాపుగా నీటమునిగి, పెట్టిన పెట్టుబడి అంతా 'కృష్టా'ర్పణమై రైతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారు. ఈ పరిస్థితుల్లో తమను ప్రభుత్వమే ఆదుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు సాయం అందించాలని వేడుకొంటున్నారు.

- కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 36,927 ఎకరాల్లో పంటల సాగు
- 32,866 ఎకరాల్లో పంటనష్టం
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- ప్రభుత్వం సహకరిస్తే ప్రత్యామ్నాయ పంటలు వేసుకుంటామంటున్న రైతులు

వేమూరు/భట్టిప్రోలు: ఇటీవల వచ్చిన వరదల వల్ల లంక గ్రామాల్లోని ఉద్యాన పంటలు పూర్తిగా మునిగి పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో రైతులు ఉద్యాన పంటలు సాగు చేశారు. వరదల వల్ల పంటలు పూర్తిగా నీటమునిగాయి. ఇప్పుడిప్పుడే పొలాల్లోనుంచి నీరు బయటకు వెళుతుండడంతో ఉన్న కొద్దోగొప్పో పంటనైనా కాపాడుకోవచ్చనే రైతాంగం ఆశలపై తాజా వరద నీళ్లు జల్లింది.

రూ.లక్షల్లో నష్టం..

కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో ఉద్యాన పంటలు సాగుచేసిన రైతులు రూ. లక్షల్లో నష్టపోయారు. రెండు మండలాల్లో 24 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. దాదాపు 19,939 ఎకరాల్లో పంట దెబ్బతినింది. కొల్లూరు మండలంలో 12,927.5 ఎకరాల్లో వివిధ ఉద్యాన పంటలు సాగు చేశారు. 6,327.5 ఎకరాల్లో పంట దెబ్బతింది. భట్టిప్రోలు మండలంలో 6,012 ఎకరాలకు 3,772.5ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.



పెదలంకలో రంగు మారిన అరటి తోటలో నీటి నిల్వ

నీట మునిగిన పంటలు



చిలుమూరు లంకలో పూర్తిగా నీట మునిగిన పసుపు పంట

మరుభూమిని తలపిస్తున్న లంకలు

భట్టిప్రోలు మండలంలోని కృష్ణానది పరివాహక లంక గ్రామాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, పల్లెపాలెం, గొరిగపూడి పెదపులివర్రు, అక్కివారిపాలెం, సొసైటీ భూములలో సాగువుతున్న వాణిజ్య పంటలు రంగు మారి వడబడి పోతున్నాయి. పంట పొలాలు మురుగెత్తి దుర్గంధం వెదజల్లుతోంది. నిన్న మొన్నటి వరకు పచ్చని పంట పొలాలతో ఉన్న లంక గ్రామాల పంట పొలాలు మరుభూమిని తలపిస్తున్నాయి.

వరదల వల్ల రూ.10 లక్షలు నష్టం



లంక గ్రామంలో 6 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశాను. వరదలు రావడంతో 6 ఎకరాలూ మునిగి పోయాయి. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడి రూ.10 లక్షలు కృష్ణార్పణం అయ్యాయి.

– తోడేటి రత్నకర్, చింతర్లంక, కొల్లూరు మండలం

ప్రభుత్వం సహకరిస్తే ప్రత్యామ్నాయ పంటలు...



వరద ప్రభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం సహకరిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకొనే వీలుంటుంది. ప్రత్యామ్నాయ పంటల వల్ల కొంత మేరకు అప్పుల నుంచి బయట పడతాము.

– తోడేటి సురేష్, చింతర్లంక, కొల్లూరు మండలం

కొల్లూరు మండలంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	దెబ్బతిన్న పంట (ఎకరాలు)
అరటి	4935	2,439.5
కొబ్బరి	50	30
పూలతోటలు	32.5	20
జామ	15	7.50
ఆయిల్ పామ్	4	4
బొప్పాయి	16	12
పసుపు	3935	2121
కంద	2155	1161
తమలపాకు	1050	338.5
కూరగాయలు	725	282.5

భట్టిప్రోలు మండలంలో ...

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	దెబ్బతిన్న పంట (ఎకరాలు)
అరటి	2152.5	1125
జామ	275	125
బొప్పాయి	15	10
పసుపు	2025	1225
కంద	1437	890
కూరగాయలు	102	56



పోతర్లంక గ్రామంలో పూర్తిగా దెబ్బతిన్న కంద పంట



పశువులకు గ్రాసం కరువు

కొల్లూరు: వరదల కారణంగా పశువులకు గ్రాసం కరువైంది. వరద నీటి ముంపునకు గురై పచ్చ మేత పూర్తిగా కుళ్లిపోవడంతోపాటు, వరిగడ్డి వాములు సైతం కొట్టుకుపోవడంతో పశువులు మేత కోసం అలమటిస్తున్నాయి.



దండిగా ప్లాస్టిక్ వస్తువుల సేకరణ

కొల్లూరు: లంక గ్రామాలలో వరదల్లో కొట్టుకొచ్చిన ప్లాస్టిక్ వస్తువులు, గృహోపకరణాల సేకరణలో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే వ్యక్తులు తలమునకలవుతున్నారు. వరద నీటికి భారీగా గృహాల్లోని వస్తువులు కొట్టుకురావడంతో చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తులు లంక గ్రామాలకు చేరుకొని ప్లాస్టిక్ వస్తువులు సేకరించి తరలించుకొని సొమ్ము చేసుకుంటున్నారు.

బతుకు సాగదు.. భరోసా దక్కదు

సుడిగుండంలో గంగపుత్రుల జీవనం

- వరుస తుఫాన్లతో వేటలేక అగచాట్లు
- మత్స్యకార భరోసాపై కూటమి ప్రభుత్వం మీనమేషాలు
- వేట నిషేధం పూర్తయి రెండు నెలలు దాటినా దక్కని సాయం



సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు (ఫైల్)

చీరాల: గంగమ్మ తల్లిని నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారులు కష్టాల సుడిలో కొట్టుమిట్టాడుతున్నారు. గంగపుత్రుల పరిస్థితి ముందుకెళ్తే ముప్పు వెనుకచూస్తే అప్పులు అన్న చందాన మారింది. ఈనెలలోనే రెండుసార్లు అల్పపీడనాలు, తుపాన్లతో పాటు, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో అటు వేట సాగక, పూట గడవక మత్స్యకారులు అష్టకష్టాలు పడుతున్నారు. మత్స్యకార భరోసాతో అయినా ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

డిసెంబర్ వరకు తుఫాన్ల కాలమే..

ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో తీర ప్రాంత జనం తుఫాన్ల ప్రభావానికి గురవుతున్నారు. మత్స్యకార, తీర ప్రాంత గ్రామాలు తుపానుల ధాటికి ప్రాణ, ఆస్తి నష్టాలను గతంలో చవిచూశాయి. ఇటీవల వచ్చిన అల్పపీడనం, వరదల నేపథ్యంలో వేటసాగక విలవిల్లాడుతున్నారు. ఎన్నో వ్యయప్రయాసలతో సముద్రంలో వేటకు వెళితే డీజిల్ ఖర్చు కూడా రావడంలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాదిలో అల్ప పీడనాలు, వాయుగుండాలతో సముద్రం అల్లకల్లోలంగా మారి మత్స్యకారులకు శాపంగా మారింది. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆదుకోవాల్సిన ప్రభుత్వం తమను పట్టించుకోవడం మానేసిందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నేతల మాటలు వట్టి మూటలుగానే మిగిలాయే తప్ప మత్స్యకారులకు మిగిలిందేమీ లేదంటున్నారు.


'భరోసా' ఏదీ?

ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో మత్స్యకారులకు వేట నిషేధం ఉంటుంది. ఈసమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం భృతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి నేతలు అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు ఇచ్చారు. తీరా అమలు సమయానికి కుంటిసాకులతో సరిపెడుతున్నారు. మత్స్యకార భరోసాపై రీసర్వే పేరుతో కాలాయాపన చేస్తూ కష్టాల్లో చిక్కుకున్న గంగపుత్రులకు సాయం అందించడం లేదు. మత్స్యకారుల వేట నిషేధ కాలం ముగిసి రెండునెలలు కావస్తుంది. ఇంతవరకు అందాల్సిన సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. దీనికితోడు భరోసా నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం కొత్త నిబంధనలు తెరపైకి తేవడం మత్స్యకారుల్లో ఆందోళనను రెట్టింపు చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో ఐదేళ్ల క్రమం తప్పకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ రూ. 10 వేల చొప్పున మత్స్యకార భరోసా అందించింది. దీంతో వేట నిషేధ సమయంలో మత్స్యకారుల ఇబ్బందులు తొలిగేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేల నుంచి రూ. 20 వేలు పెంచుతామంటూ హామీ ఇచ్చింది. బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల, రేపల్లె, పర్చూరు, బాపట్ల నియోజకవర్గాల్లోనే సముద్రంలో వేట చేసే మత్స్యకారులు 12, 500 మంది ఉన్నారు. వీరికి రూ.20 వేలు చొప్పున రూ. 25 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

రీసర్వే పేరుతో కాలయాపన..

జిల్లాలో చీరాల, వేటపాలెం, బాపట్ల, రేపల్లె, బీవీ పాలెం ఇలా మొత్తం ఏడు మండలాల్లో 76 కిలోమీటర్ల మేర తీరం ఉంది. 12,500 మంది లబ్ధిదారులున్నారు. వేట నిషేధ సమయంలో 18 వేలకు పైగానే మత్స్యకారులు ఇంటి వద్ద ఉంటూ వలలు మరమ్మతులు చేసుకుంటుంటారు. ఈ క్రమంలో అధికారులు ఆయా ప్రాంతాలలో ప్రత్యక్ష సర్వే ద్వారా అర్హులను గుర్తించి వారికి పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా అందజేసేవారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ రీసర్వే అంటూ మెలిక పెట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 10 వేలు మత్స్యకార భరోసా పేరిట మత్స్యకారులకు పరిహారం అందజేసింది. అయితే కూటమి ప్రభుత్వం రీసర్వే పేరుతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తారేమోననే అనుమానాలు మత్స్యకారుల్లో ఉన్నాయి.

త్వరగా భరోసా సాయం అందించాలి..



అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా వేట నిషేధం ముగిసి రెండు నెలలు కావస్తున్నా మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేదు. గత ప్రభుత్వ హయాంలో ఠంఛనుగా రూ.10 వేలు మా బ్యాంకు ఖాతాకు జమయ్యేవి. ప్రస్తుతం సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారు. మా బాధలు అర్థం చేసుకుని త్వరగా సాయం అందించాలి.

– అంజయ్య, మత్స్యకారుడు

కరకట్టలను కొట్టేసి.. ఇసుక అమ్మేసి

- చీరాలలో రొంపేరు డ్రెయిన్ గట్లు ఛిద్రం
- అక్రమంగా ఇసుక కొల్లగొడుతున్న అధికారపార్టీ నేత
- ప్రతిరోజు రాత్రిపూట 50 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా
- పచ్చపార్టీ నేత తనయుడి అక్రమ వ్యాపారం
- హైదరాబాద్ బ్యాచ్‌తో దందా
- కరకట్ట తవ్వకాలతో పలుగ్రామాలకు ముంపు ప్రమాదం



రొంపేరు డ్రెయిన్ కరకట్ట తవ్విన దృశ్యం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కొందరు అధికారపార్టీ నేతలు అక్రమార్జనే ధ్యేయంగా అక్రమ వ్యవహారాలకు తెగబడుతున్నారు. ఇసుక, మట్టితో సహా ఏది దొరికినా అమ్మకానికి పెట్టి అందినకాడికి దండుకుంటున్నారు. తాజాగా చీరాల ప్రాంతానికి చెందిన పచ్చపార్టీనేత ఏకంగా డ్రెయిన్ (రొంపేరు స్ట్రయిట్ కట్) కరకట్టలను తవ్వేసి ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

■ వేటపాలెం, చీరాల మండలాల పరిధిలోని ఈపూరుపాలెం, కొత్తపాలెం గ్రామాల మీదుగా పొలాల్లోని మురుగు బయటకు పోయేందుకు సముద్రం వరకు సుమారు 6 కి.మీ మేర ఐదు దశాబ్దాల క్రితం డ్రెయిన్ ఏర్పాటుచేశారు. పచ్చపార్టీ నేతలు డ్రెయిన్ కరకట్టలను రాత్రికి రాత్రే కొల్లగొడుతున్నారు. మైనింగ్, విజిలెన్స్ అధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులంతా గత పదిరోజులుగా వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని వరద ప్రాంతాల్లో ఉండడం ఆ అధికారపార్టీ నేత తనయుడికి కలిసొచ్చింది. ఇదే అదునుగా సదరు నేత అనుచరులు పొక్లెయిన్‌లు, ఇటాచ్‌లు పెట్టి అక్రమంగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. రోజుకు వందలాది ట్రాక్టర్ల ఇసుకను వేటపాలెం, చీరాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ. 4,500 నుంచి 5,500లకు విక్రయిస్తున్నారు.

■ డ్రెయిన్ కరకట్టతోపాటు సముద్ర తీరప్రాంతంలో ఉన్న పందిళ్లపల్లి, అక్కాయపాలెం, చల్లారెడ్డిపాలెం, వాకాయపాలెం, బుర్లవారిపాలెం, గవినివారిపాలెం గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూములతో పాటు అటవీశాఖ భూములనుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ తరలింపు వ్యవహారాన్ని పచ్చపార్టీనేత తనయుడు హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితులను పెట్టి నడిపిస్తున్నట్లు అధికారపార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి.

ఎత్తిపోతల పథకాలకూ నష్టం..

స్ట్రయిట్‌కట్ పరిధిలో రామన్నపేట, బచ్చులవారిపాలెంగ్రామాల సమీపంలో రెండు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి పలుగ్రామాల పరిధిలో పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. కాలువ కరకట్టలు కొల్లగొట్టడం వల్ల వరదనీరు బయటకు పోయి ఎత్తిపోతల పథకాలకు నీరందే పరిస్థితి ఉండదు. దీంతో ఆ ప్రాంతం రైతులకు తీవ్రనష్టం వాటిల్లనుంది. అయినా అధికారపార్టీనేత తనయుడు ఏమాత్రం ఖాతరు చేయక కరకట్టలను తవ్వేసి ఇసుకను అక్రమంగా తరలించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దివంగత వైఎస్సార్ హయాంలో కాలువ ఆధునికీకరణ

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పూడికతో నిండి పోయిన స్ట్రయిట్ కట్ ఆధునికీకరణకు నిధులు కేటాయించి ప్రధానంగా కాలువలో ఉన్న పూడికతీసి ఇరువైపుల ఉన్న కరకట్టలను బలోపేతం చేశారు. దీంతో వచ్చిన మురుగు, వరదనీరు నేరుగా సముద్రంలో కలిసేది.

తవ్వకాలతో పొంచిఉన్న వరద ముప్పు..

పచ్చపార్టీనేత రొంపేరు స్ట్రయిట్‌కట్ కరకట్టలను రాత్రిపూట తవ్వి ఇసుకను అక్రమంగా రవాణాచేసి అమ్ముకుంటుండంతో కరకట్టలు బలహీనంగామారి స్ట్రయిట్‌కట్ నుంచి వచ్చే మురుగు, వరదనీరు గట్టులనుంచి బయటకు వచ్చేఅవకాశముంది. దీంతో చేనేతపురి, కొనిజేటినగర్ తోపాటు పలుగ్రామాలు, కాలనీలను వరద ముంచెత్తి ప్రజలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే ప్రమాముంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం ద్వారా విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చెప్పారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాల రవాణా చార్జీలు తగ్గింపు

ఉచిత ఇసుక విధానంలో వాహనాల రవాణా చార్జీలను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగింది. ఇసుకను అత్యంత తక్కువ ధరకే వినియోగదారులకు అందిస్తామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇసుక రవాణా చార్జీలను తగ్గిస్తూ జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుందని ప్రకటించారు. 4.5 మెట్రిక్ టన్నుల ఇసుక 10 కిలోమీటర్ల లోపు ఒక ట్రాక్టర్ రవాణా ఖర్చు కేవలం రూ. 549గా నిర్ణయించామన్నారు. అలాగే 20 కిలోమీటర్లకు రూ.1,098, 30 కిలోమీటర్లకు రూ.1,647, 40 కిలోమీటర్ల వరకు రూ.2,196, 40 కిలోమీటర్లు దాటితే కిలోమీటర్‌కు ఆరు రూపాయల చొప్పున ధర ఉంటుందన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఆర్‌బీఐ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించి 90 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఆర్‌బీఐ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సోమవారం విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 17వ తేదీలోగా విద్యార్థులు తమ పేర్లు https://www.rbi90quiz.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

12న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి (పీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 12న పెన్షన్ అదాలత్, ప్రయాస్ వెబినార్ నిర్వహిస్తున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ జీఆర్‌జీఆర్ మాధవ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్యాప్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా హాజరుకాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. so.f unt ur@e pfi ndia.gov.i n తో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2644 955 1275 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యార్డుకు 33,890 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 33,890 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,442 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 98,000 నుంచి రూ. 18,400 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,287 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

పట్నంబజారు: గుంటూరు నగరంలోని ఏటీఅగ్రహారంలో నివాసం ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ నివాసంలో చోరీపై సోమవారం కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీఅగ్రహారంలో నివాసం ఉండే కొండపాటూరి రామకృష్ణ ఏఆర్ ఎంటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుక భాగం నుంచి తలుపులు పగులగొట్టి, లోపలకు వచ్చారు. సుమారు పది సవర్ల బంగారు ఆభరణాలు, పలు వెండి సామాన్లు అపహరించుకు పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండండి

సిబ్బందికి ఎస్పీ తుషార్‌డూడీ సూచన

బాపట్లటౌన్/చీరాల: వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లాలోని సూర్యలంక, వాడరేవు బీచ్‌లను సోమవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ప్రధానంగా విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. తీరంలో వరుస క్రమంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయించాలన్నారు. నిమజ్జనం చేయడానికి తీసుకువచ్చే వినాయకుని విగ్రహంతో పాటు ఐదు నుంచి పది మందిని మాత్రమే అనుమతించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, మద్యం సేవించిన వారిని అనుమతించరాదన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి వెళ్లే వాహనాలు, నిమజ్జనం ముగించుకొని వచ్చే వాహనాలు వేరు మార్గాల్లో ప్రయాణించే విధంగా చూడాలన్నారు. వీలైనంతవరకు రాత్రి 10 గంటలలోపు నిమజ్జనాలు ముగిసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం అనంతరం స్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రక్షణ పరంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తగిన లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, పోలీసు అధికారులు, సిబ్బంది 24/7 నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, భక్తులు స్వేచ్ఛగా, సురక్షితంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువైన పరిస్థితులు కల్పించాలన్నారు.



సూర్యలంక తీరంలో పోలీస్‌సిబ్బంది, గజ ఈతగాళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

జిల్లాలో మొత్తం 1536 విగ్రహాలు..

జిల్లాలో మొత్తం 1536 వినాయక విగ్రహాల ఏర్పాటు చేశారన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సుమారు 341 విగ్రహాలను నిమజ్జనం చేశారన్నారు. జిల్లాలో ఉన్న సుమారు 200 నిమజ్జన ప్రదేశాలలో పటిష్ట బందోబస్తు నిర్వహించామన్నారు. ఎస్పీతోపాటు డీఎస్పీ జగదీష్ నాయక్, జిల్లా ఎస్బి సీఐ నారాయణ, బాపట్ల రూరల్ సీఐ గంగాధర రావు, చీరాల రూరల్, వేటపాలెం ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

గణనాథుల నిమజ్జనాల సమయంలో సముద్ర తీర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్నిఏర్పాట్లు తీసుకోవాలని పోలీసులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. సోమవారం చీరాలలోని వాడరేవు, రామాపురం సముద్ర తీరంలో జరుగుతున్న గణేషుడి నిమజ్జనోత్సవాలను, ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్, సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ శివకుమార్, వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వరు ఉన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 42 మంది బాధితులు ఎస్పీను కలిసి తమ సమస్యలను వివరించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ సంబంధిత స్టేషన్ సీఐ, ఎస్ఐలకు నేరుగా ఫోన్‌చేసి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఎస్ఐ సురేష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గండిపై ప్రశ్నించిన వ్యక్తికి వేధింపులు

- టీడీపీ మండల అధ్యక్షుడి ఆదేశాలకు తలొగ్గిన పోలీసులు !
- కొల్లూరు పోలీసుస్టేషన్‌లో కూర్చోపెట్టి మనోవ్యథకు గురిచేసిన వైనం

కొల్లూరు: వరద పీడిత గ్రామాల్లో టీడీపీ కుట్ర రాజకీయాల ఫలితంగా ఓ వ్యక్తి పోలీసుల వేధింపులకు గురయ్యాడు. పంట పొలాల్లో నిలిచిన వరద నీటిని వేరే గ్రామాల వైపు మళ్లించి, దౌర్జన్యంగా రహదారికి గండి పెట్టడాన్ని ప్రశ్నించిన పాపానికి వ్యక్తిని పోలీసులు స్టేషన్‌కు పిలిచి ఇబ్బందులకు గురిచేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బాధితుడి కథనం మేరకు.. టీడీపీ కొల్లూరు మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, తన అనుచరులతో కలిసి శనివారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పోతార్లంక పరిధిలోని పంటపొలాల్లో నిలిచిన నీటిని ఆర్అండ్‌బీ రహదారులకు గండికొట్టి వేరే గ్రామాలకు మళ్లించబోయాడు. దీనిపై తోకలవారిపాలెం శివారు కృష్ణనగర్‌కు చెందిన కుక్కల అర్జున్‌రావు ప్రశ్నించాడు. దీంతో రెచ్చిపోయిన మైనేని మురళీకృష్ణ అర్జున్‌రావును దుర్భాషలాడాడు.. వాడిని ఇటు లాక్కురండి, వాడి అంతు చూస్తా అంటూ బెదిరింపులకు పాల్పడటమే కాకుండా, కొల్లూరు పోలీసులను బాధితుడి ఇంటిపై పంపించాడు. ఈక్రమంలో సోమవారం తెల్లవారుజామున బాధితుడి ఇంటికి వెళ్లిన పోలీసులు బలవంతంగా పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ ఏడుకొండలు వచ్చే వరకు నేలపై కూర్చోవాలని ఆదేశించారు. తనకు ఇటీవల యాంజియోగ్రామ్ చేశారని, బీపీ, షుగర్‌తో ఇబ్బంది పడుతున్నానని ట్యాబ్లెట్‌లు అయినా ఇప్పించాలని వేడుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి అతని బంధువైన యువకుడు ట్యాబ్లెట్‌లు, టిఫిన్ తీసుకొచ్చి అందించడంతో వాటిని పోలీసులు అనుమతించారు. ఎస్ఐ వచ్చిన అనంతరం విచారించి మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు.



కొల్లూరు పోలీసు స్టేషన్‌లో అర్జునరావు

మళ్లీ రావాల్సిందేనని ఫోన్‌లో వేధింపులు..

అయితే సాయంత్రం తిరిగి పదేపదే పోలీసులు ఫోన్‌లు చేసి నిన్ను భోజనానికి వెళ్లమంటే ఇంటికి ఎవడు వెళ్లమన్నాడురా.. అంటూ దూషిస్తూ ఉన్నపళంగా స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. గ్యాస్ సమస్యతో బాధపడుతున్నానని, తనకు భార్య లేదని, ఇద్దరు పిల్లలు ఆందోళనకు గురవుతున్నారని తనను వదిలిపెట్టాలని ఫోన్‌లో వేడుకున్నా పోలీసులు కనికరం చూపకుండా స్టేషన్‌కు రావాలని పదే పదే ఫోన్లు చేయసాగారు. టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని ఆదేశాలకు తలొగ్గిన పోలీసులు తనను మానసిక క్షోభకు గురిచేయడంపై బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ఆయా గ్రామాలలో టీడీపీ నాయకుల వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టీటీడీ ఆలయంలో చోరీ

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరం టీటీడీ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు రెండు హుండీలు పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. వాటిల్లో సుమారు రూ.50 వేలు ఉండొచ్చని టీటీడీ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమరావతి రాజధానిగా ప్రకటించిన తరువాత ఆలయాన్ని టీటీడీ తీసుకోవడంతో భద్రత పెంచారు. సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. అయితే, చోరీ జరిగిన సమయంలో సెక్యూరిటీ సిబ్బంది వాష్ రూమ్ నిమిత్తం బయటకు వెళ్లానని చెబుతున్నట్లు సమాచారం. ఘాట్ రోడ్డుకు కింద గుడి వద్ద కూడా ఒకరు కాపలాగా ఉంటున్నారు. ఇంత భద్రత నడుమ చోరీ ఎలా జరిగిందనే దానిపై పోలీసులకు ఇంకా స్పష్టత రాలేదు. క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

179 బాటిళ్ల తెలంగాణ మద్యం పట్టివేత

బెల్లంకొండ: తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం రాత్రి సమయంలో పట్టుకున్నట్లు ఎస్ఐ రాజా తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం తీసుకొస్తున్నారని సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. పాపాయపాలెం గ్రామ సమీపంలో పిల్లేరు వాగు వద్ద మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం తరలిస్తున్న రాంబాబు, పెద్దోడులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 179 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి, సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

- కత్తులు, క్రికెట్ బ్యాట్‌లతో మూకుమ్మడి దాడి
- బాధితుడి పరిస్థితి విషమం

యద్దనపూడి: భూవివాదం వల్ల నెలకొన్న పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఐదుగురు కలిసి విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన ఘటన మండలంలోని చిమటవారిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గనిపిశెట్టి శ్రీనివాసరావుకు అదే గ్రామంలోని తమ సమీప బంధువైన గండు వీరశంకరరావు కుటుంబాలకు మధ్య గత ఐదేళ్లుగా భూ వివాదం ఉంది. ప్రస్తుతం ఆ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లి భోజనం చేసి ఇంటికి వస్తున్న గనిపిశెట్టి శ్రీనివాసరావుపై మార్గమధ్యంలో శంకరరావు, అతని కుటుంబ సభ్యులైన గండు శ్రీనివాసరావు, గండు రామకృష్ణ, గండు గోపి, గండు వెంకటకృష్ణలు పథకం ప్రకారం కత్తులు, క్రికెట్ బ్యాట్లు, ఇతర మారణాయుధాలతో విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. రక్తమడుగులో పడి కేకలు వేస్తున్న శ్రీనివాసరావు అరుపులు విని స్థానికులు ఘటనా స్థలానికి రావటంతో నిందితులు గ్రామం వదిలి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు చిలకలూరిపేటకు తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ జీఎల్ శ్రీనివాసరావు, ఎస్ఐ రత్నకుమారి ఘటనా స్థలానికి చేరుకొని దాడి విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు

జిల్లాస్థాయి క్రీడలకు చెరుకుపల్లి బాలికలు ఎంపిక

చెరుకుపల్లి: తమ పాఠశాల విద్యార్థినులు బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడల్లో జిల్లాస్థాయికి ఎంపికవడం అభినందనీయమని చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కాటూరి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఈ నెల 8న గుంటూరు ఎన్‌జీఓ హాల్లో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ సబ్‌జూనియర్ బాలికల పోటీల్లో ఏమినేని రిషిశ్రీ ఎంపికైందని, రిషిశ్రీ త్వరలో కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగే అంతర్‌జిల్లా పోటీల్లో పాల్గొంటుందన్నారు. అదేవిధంగా నరసరావుపేట శంకర భారతీపురం హైస్కూల్లో జరిగిన ఖో-ఖో సబ్ జూనియర్ బాలికల విభాగంలో కాటూరి వాసవి, పెదపల్లి వర్ష జిల్లా స్థాయికి ఎంపికయ్యారని, వీరు ఈ నెల 15న బాపట్ల జిల్లా జె.పంగులూరులో జరిగే అంతర్‌జిల్లా ఖో-ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన బాలికలను వ్యాయామ ఉపాధ్యాయుడు కాటూరి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు

మూగజీవాల మృత్యువాత

రేపల్లె రూరల్ : వరదల కారణంగా మూగజీవాలకు మేత కరువై, వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి. రేపల్లె మండలం పెనుమూడి, రావిఅనంతవరం, భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం గ్రామాల్లో సుమారు రెండు వేలకు పైగా గొర్రెలు, మేకలు, 200కు పైగా గేదెలున్నాయి. కృష్ణమ్మకు వచ్చిన వరదలతో నదీ పరివాహక ప్రాంతాల్లోని లంక గ్రామాలతో పాటు నదీ మధ్యలోని లంకలు, దిబ్బలు పూర్తిగా నీటమునిగాయి. దీంతో మూగజీవాలకు మేత దొరక్క రోగాల బారినపడి మృత్యువాత పడుతున్నాయి. గాలికుంటు, నోటిచొంగ వంటి వ్యాధులతో పాటు జ్వరాల బారినపడి నీరసించి చనిపోతున్నాయని గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మూగ జీవాలకు మేత, దాణాను అందించాలని కోరుతున్నారు.



మేత లేక ఓలేరు కరకట్టపై నీరసించి పడుకున్న గొర్రెలు, మేకలు

6 గొర్రెలు గల్లంతు.. 3 మృత్యువాత



నాకు 100 గొర్రెలు, 10 మేకలు, 5 గేదెలున్నాయి. వరదల్లో ఆరుకు పైగా గొర్రెలు కనిపించకుండా పోయాయి. వారం రోజులుగా మేత లేకపోవడంతో గాలికుంటు, నోటి చొంగ వ్యాధులతో నీరసించి ఇప్పటికే మూడు గొర్రెలు మరణించాయి. ప్రభుత్వం స్పందించి మేత అందించాలి.

– పెద్దిబోయిన నాగమల్లేశ్వరరావు, ఓలేరు పల్లెపాలెం

ప్రభుత్వం ఆదుకోవాలి



వరదల కారణంగా మూగ జీవాలకు మేతను అందించలేకపోతున్నాం. నాకు 60 గొర్రెలుండగా ఇప్పటికే గాలికుంటు, నోటిచొంగ వ్యాధులతో 6 గొర్రెలు మృతి చెందాయి. మిగిలాయి. బాగా నీరసించిపోయాయి. మూగజీవాలపై ఆధారపడి జీవిస్తున్న మమ్మల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం దాణా, మేతను అందించాలి.

– డొక్కు శ్రీనివాసరావు, ఓలేరు పల్లెపాలెం

మనస్థాపంతో వ్యక్తి బలవన్మరణం



మృతుడు దండుప్రోలు సోమయ్య (ఫైల్)

చినగంజాం: మనస్థాపంతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండల పరిధిలోని పల్లెపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ పెద్దపల్లెపాలెం గ్రామానికి చెందిన దండుప్రోలు సోమయ్య (32) సముద్రతీరంలోని ఒడ్డును ఉన్న సరుగుడు చెట్లలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమయ్య 20 రోజుల క్రితం తల్లిదండ్రులతో చిన్నపాటి గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతనికి ఏడాదిన్నర క్రితం వివాహం కాగా భార్య జ్యోతి గర్భిణి కావడంతో ఇటీవల కరేడు గ్రామం పుట్టింటికి వెళ్లింది. ఆమె కూడా 10 రోజుల క్రితం మగబిడ్డను ప్రసవించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సోమవారం స్థానికంగా సముద్ర ఒడ్డున చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని సముద్ర తీరంలో గొర్రెల కాపరులు గుర్తించి గ్రామంలో సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి వెళ్లిన అతని తల్లిదండ్రులు వారి కుమారుడు సోమయ్యగా గుర్తించారు. మృతుడి సోదరుడు గణేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ పి.ప్రకాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

వేటపాలెం: జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఆదివారం అర్ధరాత్రి చల్లారెడ్డిపాలెం ఎఫ్‌సీఐ గోదాముల వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న గుర్తు తెలియని మహిళను లారీ ఢీకొట్టింది. మహిళ తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు యాచకురాలై ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

దుర్గి: నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయం దర్శనానికి వచ్చి ఆదివారం ఉదయం 11 గంటలకు గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. బాపట్ల జిల్లా చీరాల మండలం గవినివారిపాలేనికి చెందిన మిండా బాలు (21) కుటుంబ సభ్యులతో అమ్మవారి దర్శనానికి వచ్చాడు. నాగార్జునసాగర్ కాలువలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. సోమవారం జూలకల్లు లాకుల వద్ద మృతదేహం లభ్యమైంది. యువకుని ఆచూకీ కోసం స్థానిక ఎస్ఐ వై.సుధీర్‌కుమార్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది కొన్ని రోజులుగా గజ ఈతగాళ్లతో తీవ్రంగా గాలించారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు బాలు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పిడుగురాళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జవహర్ నవోదయలో ప్రవేశాలకు ఆహ్వానం

నకరికల్లు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో చేరగోరే విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఎస్.ప్రసాద్ సూచించారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదోతరగతి చదువుతూ ఉండాలన్నారు. మూడు, నాలుగో తరగతులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 1 మే 2013 నుండి 31జులై 2015 మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మూడో వంతు సీట్లు బాలికల కోసం కేటాయింపు ఉందన్నారు. 18 జనవరి 2025 న, 12 ఏప్రియల్ 2025న ప్రవేశపరీక్షలు నిర్వహించబడతాయన్నారు. వివరాల కోసం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయం, 9901009587, 9866660593, 9494676751 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

భావితరాలకు తెలుగు పద్యం అందించాలి

ఘనంగా కొప్పరపు కవుల కళాపీఠం 22వ వార్షికోత్సవం

నరసరావుపేట ఈస్ట్: తెలుగు పద్యం, అవధాన ప్రక్రియను భావితరాలకు అందించాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందని కొప్పరపు కవుల సాహితీ పురస్కార గ్రహీతలు పేర్కొన్నారు. శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి కళాపీఠం, శ్రీనరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీ భారతీ తీర్థస్వామి కళావేదికలో అవధాన కళా కేళి సాహితీసభ, కొప్పరపు సీతారామప్రసాదరాయకవి శత వసంతోత్సవం, అవధాని ప్రక్రియ నిర్వహించారు. కొప్పరపు కవుల వంశీకుడు మా శర్మ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ద్విభాషా ద్విశతావధాని పాలడుగు శ్రీచరణ్, ద్విశతావధాని బులుసు అపర్ణలకు కొప్పరపు సాహితీ పురస్కారంతో సత్కరించారు. గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాదు, శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాదులను సత్కరించారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ కొప్పరపు కవుల ధారణను ఇప్పటి వరకు అందుకున్న సాహితీవేత్తలు లేరనీ, ఇకముందు రారని తెలిపారు. ఇతర భాషా ప్రక్రియలలో లేని అవధాన ప్రక్రియను భావితరాలకు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొప్పరపు కవులు ఆసువుగా దాదాపు 8లక్షల పద్యాలను చెప్పారనీ, ఇవి లెక్కకు వచ్చినవి మాత్రమేనన్నారు. కొప్పరపు కవుల పలుకు పద్యంగా రాణించిందని కొనియాడారు. నటుడు, కవి డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ కొప్పరపు కవుల పద్యాలను గానం చేసి అలరించారు. పాలడుగు శ్రీచరణ్ నిర్వహించిన అవధానం ఆకట్టుకుంది. అవధాన సంచాలకులుగా శతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ వ్యవహరించాగా పృచ్ఛకులుగా డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి (నిషిద్ధాక్షరి), డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు (సమస్య), పోలూరి వెంకటశివరామప్రసాదరావు (దత్తపది), డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి (వర్ణన), డాక్టర్ వేదాన్తం సత్యశ్రీనివాస అయ్యంగార్ (న్యస్తాక్షరి), డాక్టర్ కె.వి.కోటయ్య (ఆశువు), డాక్టర్ నారాయణం వెంకటరాంబాబు (పురాణం), రత్నాకరం రాము (అప్రస్తుత ప్రసంగం)తో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జస్టిస్ ఎన్ఆర్ఎల్ నాగేశ్వరరావు, కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అధ్యక్షుడు శ్రీగిరిరాజు అయ్యపరాజు తదితరులు పాల్గొన్నారు.



కొప్పరపు కవుల సాహితీ పురస్కారం అందుకున్న శ్రీచరణ్, అపర్ణ, అవధానులతో మా శర్మ

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఇరువురు ఎంపిక

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురి విద్యార్థులు ఎంపికయ్యారు. గుంటూరు ఎన్జీవో హోంలో ఈనెల 8న ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి సునేంద్ర, షేక్ బాలసైదాలు ఎంపికయ్యారు. ఈనెల 14,15,16 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున వీరు ఇరువురు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.కుమారశాస్త్రి సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసి చైర్మన్ ఎం సుబ్బారావు, ఏ.శివకృష్ణ, కేదార్‌నాథ్, సాంబయ్య, ప్రసాదరావు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు జి.తులసీరామ్‌నాయక్, తదితరులు ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జి హెచ్ఎమ్ కుమారశాస్త్రి, పీఈటీ తులసీ రామ్‌నాయక్